## లంచగాండుల వివరాలు ఏసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
తెలుగు దినపత్రిక


## పనులు నాణ్యతతో, నిర్ణీత కాలంలో పూర్తి చేయాలి

ఖమ్మం,: నగర అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 44వ డివిజన్‌లో కోటి 50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజల అంగీకారంతో అవసరమైన చోట్ల రోడ్డు విస్తరణ పనులు చేపడతామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పూనుకొల్లు నీరజ, కమీషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అసిస్టెంట్ కమీషనర్ అనిల్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ సంపుటి:16 సంచిక:93 ఎడిటర్: సయ్యద్ పాష 21-04-2026 మంగళవారము పేజీలు :8 వెల:1/-


## తెలుగు రాష్ట్రాలకు కూల్ న్యూస్..



హైద్రాబాద్: తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. తెలంగాణలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ విశ్లేషణ, వాతావరణ హెచ్చరికలను హైదరాబాద్ వాతావరణశాఖ జారీ చేసింది. ద్రోణి / గాలి విచ్చితి ఒకటి ఈరోజు తెలంగాణ ప్రాంతం నుండి రాయలసీమ అంతర్గత తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు సముద్రమట్టం నుండి 1.5 కి మీ ఎత్తులో ఏర్పడింది. నిన్న తూర్పు ఉత్తర ప్రదేశ్ నుండి దక్షిణ ఛత్తీస్‌గఢ్ వరకు కొనసాగిన ఉపరితల ద్రోణి ఈరోజు తూర్పు బీహార్ నుండి జార్ఖండ్, ఉత్తర చత్తీస్‌గఢ్ మీదుగా నైరుతి మధ్యప్రదేశ్ ప్రాంతం వరకు సగటు సముద్రం నుండి 0.9 కి మీ ఎత్తులో కొనసాగుతోంది. నిన్న ఉత్తర అంతర్గత కర్నాటక నుండి మన్నార్ వరకు కొనసాగిన ఉత్తర దక్షిణ ద్రోని ఈరోజు బలహీనపడినట్లు హైదరాబాద్ వాతావరణశాఖ స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఈరోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ స్పష్టం చేసింది. రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలలో పెద్ద మార్పు ఏమి లేదని తెలిపింది. ఈరోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30- 40 కి.మీ వేగం కలిగిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈరోజు రాష్ట్రంలోని ఒకటి రెండు పశ్చిమ, తూర్పు జిల్లాలలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, వడగళ్ళతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. అటు ఏపీలో కూడా రాబోయే మూడ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణశాఖ తెలిపింది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అంచనా వేసింది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముందని స్పష్టం చేసింది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.

## రాజస్థాన్ రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం..



జైపూర్, : రాజస్థాన్, బలోత్రా జిల్లాలోని పచ్‌పద్ర రిఫైనరీలో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రేపు (మంగళవారం) భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ రిఫైనరీ ప్రారంభం కావాల్సి ఉంది. ఇలాంటి సమయంలో రిఫైనరీలో అగ్నిప్రమాదం జరిగింది. గాల్లో వందల అడుగుల ఎత్తు వరకు నల్లటి పొగ కమ్ముకుంది. పెద్ద సంఖ్యలో ఫైర్ ఇంజిన్లు రిఫైనరీ దగ్గరకు చేరుకున్నాయి. మంటలను ఆర్పటం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అగ్ని ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరాలేదు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పచ్‌పద్ర రిఫైనరీకి 2013 సెప్టెంబర్ 22వ తేదీన కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో అశోక్ గెహ్లాట్ రాజస్థాన్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 37,230 కోట్ల రూపాయల వ్యయంతో రిఫైనరీ పనులు మొదలయ్యాయి. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రధాని నరేంద్ర మోదీ 2018 జనవరి 16వ తేదీన ప్రాజెక్ట్ పనులను మరోసారి ప్రారంభించారు. హిందూస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్, రాజస్థాన్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టాయి. భారతదేశంలో మొదటి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఇదే కావటం విశేషం.

## కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు

# సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం



కాళేశ్వరం కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి సోమవారం శ్రీకారం చుట్టారు. కాళేశ్వరం పర్యటనకు వచ్చిన సీఎం మంత్రులతో కలిసి శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.198 కోట్లతో జరిగే ఆలయ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో గోదావరి నదిపై నిర్మించిన ఈ బ్యారేజీని గత బీఆర్ ఎస్ ప్రభుత్వం నిర్మించగా, రెండున్నరేళ్ల క్రితం కుంగింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. బ్యారేజీల్లో పరీక్షలు, ఇతర పనులను సీఎం స్వయంగా పరిశీలించనున్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) మార్గదర్శకాల మేరకు నీటి పారుదల శాఖ బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ చర్యల్లో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. మేడిగడ్డ కుంగుబాటు, ఇతర లోపాలు తలెత్తిన బ్యారేజీల పునరుద్ధరణకు కావాల్సిన డిజైన్లను సిద్ధం చేసుకుంటోంది. ప్రధానంగా బోర్ల తవ్వకంపైనే కీలక సమాచారం ఆధారపడి ఉన్నట్లు నిపుణులు సూచిస్తుండడంతో రోటర్ ట్రైప్ డ్రిల్లింగ్ విధానంలో ముమ్మరంగా తవ్వకాలు చేస్తున్నారు. ఈ తరహా యంత్రాలు దేశవ్యాప్తంగా పరిమిత సంఖ్యలో ఉండటంతో వాటిని సమకూర్చుకునే పనిలో ఇంజినీర్లు బిజీగా ఉన్నారు. వీలైనన్ని మెషిన్లు ఏర్పాటు చేసి, వేగంగా పరీక్షలు పూర్తి చేయాలని ఇటీవల నిర్వహించిన సమీక్షల్లో సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అతి జాగ్రత్తగా పరీక్షలు : మేడిగడ్డ బ్యారేజీలో 2023 అక్టోబర్ లో ఏడో బ్లాకులో పియర్స్ కుంగుబాటుకు లోనయ్యాయి. అప్పటి నుంచి బ్యారేజీ ఆపరేటింగ్‌ను పూర్తిగా నిలిపివేశారు. దీంతో బ్యారేజీల వద్ద పెద్ద ఎత్తున ఇసుక మేటలు వేసింది. కుంగిన ప్రాంతాల్లో పునాదుల్లోకి ఇసుక, నీటి ప్రవాహం వెళ్లి చేరింది. ఇప్పుడు ర్యాఫ్ట్ వద్ద బోర్ డ్రిల్లింగ్‌లను చేపట్టారు. బోర్ తవ్వకాలతో ఇప్పటికే కదిలిన నిర్మాణాలు మళ్లీ కుదుపునకు లోనయ్యే వీలుంటుంది. అందుకే రోటర్ ట్రైప్ మెషిన్లను వినియోగిస్తున్నారు. బ్యారేజీల్లో కాంక్రీట్ పటుత్వంపై పరీక్ష : ఒక్కో అడుగును అతి జాగ్రత్తగా తవ్వుకుంటూ వెళ్తున్నారు. మూడు బ్యారేజీల్లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో ఏక కాలంలో తవ్వకాలు చేపట్టాలంటే 100కు పైగా మెషిన్లు అవసరమని ఇంజినీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మరోవైపు బ్యారేజీల్లో కాంక్రీట్ ఎంత పటుత్వంగా ఉంది, ఇతరత్రా లోపాలు ఇంకా ఏవైనా ఉన్నాయా అనేది భూ భౌతిక, టెక్నికల్ పరీక్షల ద్వారా గుర్తించనున్నారు. ఇందులో అనుభవం ఉన్న సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణుల నేతృత్వంలో ఈ టెస్టులను నిర్వహిస్తున్నారు.

## దేశంలోనే రెండు లక్షలు ఒకే సారి

# రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది



ఖమ్మం,: తన్నీరు హరీష్ రావు కాదు.. కాసుల రావు, కమీషన్ల రావు, కాళ్ళేశ్వరరావు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నామకరణం చేశారు. కమీషన్ల కోసం ఆరాటపడేది నేనా..? కాళ్ళేశ్వరరావా..? చర్చకు సిద్దమని, సిద్దపేట రమ్మంటావా..? అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హరీష్ రావు సవాల్ విసిరారు. నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఏం లేదు అన్నారు. సోమవారం ఖమ్మం మంత్రి క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాజీ మంత్రి హరీష్ రావు పై ధ్వజమెత్తారు. భూకబ్జాలు గుర్చి నీతులు చెప్పే హరీష్ రావు నిన్న మీటింగ్ పెట్టింది కబ్జా కోరుల స్థలంలోనే అని ఆరోపించారు. కాళేశ్వరరావుగా ముద్రపడ్డ హరీష్ రావు కాంగ్రెస్ కు నీతులు చెబుతున్నారని దుయ్యబట్టారు. హరీష్ రావు సొంత పార్టీలో రాజకీయ భవిష్యత్ కోసం మానసిక దౌర్భాగ్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. కబ్జాదారుడు, అవినీతి కాంట్రాక్టర్ ను పక్కన పెట్టుకుని మాకు నీతులు చెబుతున్నారని అన్నారు. సిగ్గు లేకుండా ఏ మోహం పెట్టుకుని మళ్ళీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని విమర్శించారు. రుణమాఫీ పై మాట్లాడే నైతిక హక్కు హరీష్ రావు కు లేదని, దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒకే సారి రెండు లక్షల కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదని కొనియాడారు. మీ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని పేర్కొన్నారు. కబ్జాలు కమీషన్ల విషయంలో దేశంలోనే ఏ పార్టీకి లేని చరిత్ర మీకుందని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో సీతారామ ప్రాజెక్టు గుర్చి మీ గొప్పగా చెబుతున్నారు కానీ మీ పాలనలోనే పడావు పడేసిన సంగతి మర్చిపోతే ఎలా అని గుర్తు చేశారు. సెంట్రల్ వాటర్ కమీషన్ అనుమతులు లేకుండా కమీషన్ల కోసం ప్రాజెక్ట్ ను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మీ పాలనలో నిలిచిన సీతారామ ప్రాజెక్టు సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పూర్తి చేస్తున్నామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు గుర్చి మాట్లాడే నైతిక హక్కు మీకు ఉందా..? అని ప్రశ్నించారు. కమీషన్ల తీసుకునేదేవరో.. కాసులు వెనకేసుకుందేవరో..? రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందేవరో..? చర్చించుకుందాం.. సిద్దిపేటకు రమ్మంటావా..? అంటూ మాజీ మంత్రి హరీష్ రావు కు తుమ్మల సవాల్ విసిరారు. నీ సిద్దిపేటకు వస్తా.. రైతాంగం శ్రేయస్సు కోసం స్ట్రాటజిక్ లొకేషన్ లో పెట్టిన పామాయిల్ ఫ్యాక్టరీ పై చర్చకు సిద్ధమా..? అని ప్రశ్నించారు. హరీష్ రావు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ప్రజలు అన్ని చూస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఆ ఒక్క సీటు కూడా రాదని జోస్యం చెప్పారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్షయమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతమైన స్కీములను ప్రవేశపెట్టింది అన్నారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను నట్టేటా ముంచేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యానికి బోనస్ ఇచ్చి అందుకుంటున్నామని తెలిపారు. రైతుల కోసమే రైతు భరోసా ఇస్తున్నామని, యంత్రలక్ష్మి పథకం ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాలను సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. హరీష్ రావు స్వంత నియోజకవర్గంలోనే రైతులకు మేలు చేసే పామాయిల్ ఫ్యాక్టరీని ప్రారంభించామని, ఇది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ రోజు రెండవ దఫా రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా విడుదల చేస్తున్నామని, అందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, గిడ్డంగుల శాఖ చైర్మన్ నాగేశ్వరరావు, ఖమ్మం నగర మేయర్ పూనకొల్లు నీరజ, ఖమ్మం నగర కమిటీ అధ్యక్షుడు దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## లోయలో పడ్డ బస్సు- 15మంది మృతి





జమ్ముకశ్మీర్ లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ఉధమ్ జిల్లాలో సోమవారం ఉదయం ప్రయాణికుల బస్సు లోయలోపడి 15 మంది మృతి చెందారు. అనేక మంది గాయపడ్డారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలపై కేంద్రమంత్రి ఆరా తీశారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, రామ్‌నగర్ గ్రామం నుంచి ఉధమ్‌పూర్‌కు వెళ్తుండగా బస్సు ప్రమాదానికి గురైంది. ఉదయం 10 గంటల సమయంలో కాగోర్ట్ గ్రామం సమీపంలో ఉన్న ఒక ప్రమాదకరమైన మలుపు వద్ద కొండపై నుంచి బస్సు లోయలో పడింది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది మృతి చెందినట్టు గుర్తించినట్లు ఉధమ్ పూర్ డీఐజీ శివకుమార్ శర్మ తెలిపారు. మరో 20 మందికిపైగా గాయపడ్డారని, ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. అయితే స్థానికులు మాత్రం డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే బస్సు లోయలో పడిందని స్థానికులు అంటున్నారు. బస్సు అతివేగంతో వెళ్లడమే ఈ ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు మరణించిన విషయం తెలుసుకుని తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేశారు. మరోవైపు ఈ ఘటనపై జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు తర్వగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. బాధితులకు అవసరమైన సాయాన్ని అందించాలని పోలీసులు, ఎస్ డీఆర్ ఎఫ్, ఆరోగ్య శాఖను ఆదేశించారు. బస్సు ప్రమాదంపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా స్పందించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ సమయంలో బాధితలకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎక్స్ లో పోస్ట్ చేశారుయ. అలాగే మాజీ ముఖ్యమంత్రి పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఎక్స్ లో స్పందించారు. 'ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఉధంపూర్ జిల్లా కలెక్టర్ మింగా షెర్పాతో మాట్లాడాను. సహాయక చర్యలు గురించి ఆరా తీశాను. భారీ ప్రాణ నష్టం జరిగినట్లు భావిస్తున్నారు. . సాధ్యమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నారు. గాయపడిన వారిని మెరుగైన వైద్య చికిత్స కోసం ఆస్పత్రులకు తరలిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని విమానంలో తీసుకెళ్తున్నారు. నేను స్థానిక యంత్రాంగంతో పాటు రాజిందర్ శర్మ నేతృత్వంలోని మా కార్యకర్తల బృందంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం' అని జితేంద్ర సింగ్ తెలిపారు. కాగా, ఇటీవల బిహార్‌లోని కతిహార్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. అతివేగంతో వస్తున్న బస్సు అదుపుతప్పి, మొదట ఇద్దరు బైక్ రైడర్లను ఢీకొట్టి, ఆ తర్వాత ఒక పికప్ వ్యాన్‌ను ఢీకొట్టింది. దీంతో పికప్ వ్యాన్ పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో 13 మంది అక్కడికక్కడే మరణించగా, 30 మందికి పైగా గాయపడ్డారు.

## మణిపూర్ మంటలకు బీజేపీనే కారణం



కన్యాకుమారి: మణిపూర్‌లో తలెత్తిన తాజా ఉద్రిక్తతలపై బీజేపీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తప్పుపట్టారు. మణిపూర్‌ను బీజేపీ మంటల్లోకి నెట్టిందని, అక్కడి మైతీ, కుకీ తెగల మధ్య ఘర్షణలకు అధికార పార్టీనే కారణమని అన్నారు. తమిళనాడులోని కలచేల్‌లో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. మణిపూర్ ప్రశాంతంగా ఉండే రాష్ట్రమని, అక్కడ మంటపెట్టారని, వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికీ అక్కడ పౌరయుద్ధం జరుగుతూనే ఉందని అన్నారు. మణిపూర్‌లోని ట్రోంగ్లావోబి ఆవాంగ్ లీకై ప్రాంతలో ఈనెల 7న జరిగిన మిలిటెంట్ దాడిలో ఐదేళ్ల బాలుడు, 5 నెలల చిన్నారి మరణించడంతో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. జనం ఆగ్రహంతో ప్రధాన రోడ్లను దిగ్బంధించారు. పలుచోట్ల హింసకు దిగారు. భద్రతా బలగాలు టియర్ గ్యాస్, స్మోక్ బాంబులతో ఆందోళనకారులను చెదరగొట్టారు. మణిపూర్ తరహాలోనే అన్ని రాష్ట్రాల్లో అధికారం గుప్పిట్లో పెట్టుకుని ఢిల్లీ నుంచి పాలించాలన్నదే బీజేపీ ఉద్దేశమని రాహుల్ అన్నారు. తమిళనాడులోనూ ఇప్పుడు అన్నాడీఎంకేను కంట్రోల్‌లో పెట్టుకుని ఢిల్లీ నుంచి పాలించాలనుకుంటోందని ఆరోపించారు. 'ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ అధికారాన్ని చేజిక్కించుకోవడం, ఢిల్లీ నుంచి పాలించడం బీజేపీ పని. ఇదే విషయాన్ని తమిళ ప్రజలకు చెప్పే ధైర్యం వాళ్లకు లేదు. అందువల్లే ఒకప్పుడు ఎంతో పేరున్న పార్టీని తన కంట్రోల్‌లోకి తీసుకుంది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. తమిళనాడు ప్రగతిలో అన్నాడీఎంకే కీలకపాత్ర వహించిందని, అయితే ఇప్పుడు అదంతా గతమని, ఆపార్టీలో ఇప్పుడు ఉన్నదంతా శూన్యమేనని అన్నారు. బీజేపీకి ఒక ఉపకరణంగా మాత్రమే అన్నాడీఎంకే మిగిలిందన్నారు. ఆ పార్టీ నాయకత్వం అవినీతి కారణంగానే బీజేపీకి లొంగిపోయిందని విమర్శించారు. ప్రతి రాష్ట్రానికి సొంత వాణి ఉండాలని, ప్రజలే రాష్ట్రాన్ని పాలించుకోవాలని, ఈ సంప్రదాయాలన్నింటికీ బీజేపీ వ్యతిరేకమని అన్నారు. తమిళనాడులో ప్రజాపాలన సాగాలన్నదే తమ అభిమతమని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### వాతావరణంలో తలెత్తుతున్నఅనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి...

మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణాలవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్నఅనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది మాన వుడినే. పర్యావరణాన్ని కాపాడకపోతే మానవుడి మను గడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతున్నా పట్టించుకునేవారే లేకుండాపోతున్నారు.పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. ప్రస్తుతం అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ల మధ్య జరుగు తున్న అణుయుద్ధంలో ఎంతటి విధ్వంసం జరుగుతు న్నది వేరే చెప్పక్కర్లేదు. ముఖ్యంగా పర్యావరణానికి ఎంతటి చేటు తెస్తుందో శాస్త్రజ్ఞుల అంచనాలకు అంద డం లేదు. ఇక అభివృద్ధి పేరుతో పాలకులు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి ఎంతో హాని చేస్తున్నాయి. ఇష్టానుసారంగా తవ్వకాలు మొదలు పెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగు తారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ విధ్వంసం జరు గుతున్నాయి.ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత దేశ జనాభాయే మరో దశాబ్దం నాటికి నూటయాభై కోట్ల వరకు చేరుకుంటుందని అందుకు తగినట్టుగా దేశంలో సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద హరించుకు పోతుందని స్పష్టం చేసింది. ఇప్పటికే భారత్లో ప్రతిరోజూ దాదాపు మూడువందల ఎకరాలకు పైగా అటవీ భూములు అదృశ్యమైపోతున్నా యని ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడించింది. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీ లోయ ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులను నరికి వేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ కాగితాలు మట్టి లో కలిసి పోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడు తుంది. కొన్ని ప్లాస్టిక్వ స్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమవు తున్నాయి. ఈ ప్లాస్టిక్ పర్యావర ణానికి ఎంత నష్టం చేకూరుస్తున్నదో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికార వర్గాలు విఫలమవుతున్నాయని చెప్పొచ్చు. పెట్రోలు, డీజిల్, ఇథనాల్ వాడకం గురించి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్య నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. ఎన్ని చట్టాలు చేసినా, మరెం దరిపై జరిమానాలు విధించినా పెరుగుతున్న వాహనాల సంఖ్య రెట్టింపు స్థాయిలో వాహన కాలుష్యాన్ని పెంచుతున్నది.ఇక పరిశ్రమలు వదులుతున్న పొగ, ధూళి కణాలు, తదితరవన్నీ కలిసి వాయుకాలుష్యాన్ని విస్తరిస్తు న్నాయి. దేశ రాజధాని ఢిల్లీ లాంటి ప్రదేశాల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా చలికాలంలో పరిస్థితి దారుణంగా తయారవుతున్నది. నీటి కాలుష్యం పరిస్థితి అదుపు తప్పుతున్నదేమో. పెరుగుతున్న మురికివాడలనుంచి వెలువడుతున్న కలుషిత నీరు అంచలంచెలుగా నదుల్లోకి చేరుకొని పెద్దపెద్ద నదులను మురికి కూపాలుగా మారు స్తున్నాయి. ఈ నది, ఆ నది అని కాదు. దేశంలోని నదుల్లో నీటి పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. ఇలాంటి ఎన్నో కారణాలతో భూ ఉ ష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే ఇందుకు ప్రతీగా ప్రకృతి రెట్టింపు స్థాయిలో స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కార ణంగా సకాలంలో వర్షాలు కురియడం లేదు. కురిస్తే ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం, వరదలు, తుఫాన్లు భూకంపాలు లాంటి ఉ పద్రవాలు చోటు చేసుకొంటున్నాయి. యేటా దాదాపు మూడువందల ఎనభైకి పైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి.ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఈ ఉ పద్రవాలతో ప్రాణాలు పోగొట్టుకుంటే కోట్ల సంఖ్యలో రోగపీడితులు అవుతున్నారు. పాకిస్థాన్, ఇరాన్, హైతీ, న్యూజిలాండ్, నేపాల్ లాంటి ఎన్నో దేశాలలో వస్తున్న భూ కంపాలు విలయాన్నే సృష్టిస్తున్నాయి. సిరియాలో భూకంపం కారణంగా దాదాపు తొమ్మిదివేల మందికిపైగా అసువులు బాసారు. మొరోకోలో వచ్చిన భూకంప ప్రకంపనాలతో దాదాపు నాలుగువేల మంది జీవితాలు సజీవమయ్యాయి. పశ్చిమ ఆఫ్ఘానిస్థాన్లో భూప్రకంపనాలు విలయాన్నే సృష్టించాయని చెప్పొచ్చు. భారత్కు సంబంధించి కూడా అనేక ప్రాంతాల్లో భూ ప్రకంపన వార్తలు వింటూనే ఉంటున్నాం. చెన్నై, ముంబయి, కోల్కతా, పూణె, ఢిల్లీ లాంటి దాదాపు డెబ్బై నగరాలకు భూప్రకంప నాలు పొంచి ఉ న్నట్లు శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇక వరదలు, తుఫాన్ తోవ్యవ సాయ రంగం కుదేలైపోతున్నది. తుఫాన్ల బారి నుంచి తీరప్రాంతాలు తప్పించుకోలేకపోతున్నాయి. గతంలో దివి సీమలో సంభవించిన తుఫాన్ సిరిధాన్యాలతో తులతూగే ఆ ప్రాంతాన్ని శవాల దిబ్బగా మార్చేసింది. ఇప్పటికీ ఆ బీభత్సం గురించి మరచిపోలేకపోతున్నారు. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాలి. అన్నింటికంటే ముఖ్యం గా ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో విలయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించక తప్పదు.

### కేంద్ర ప్రభుత్వ ఉ ద్యోగులకు గుడ్ న్యూస్...

న్యూఢిల్లీ:కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో డీఏ పెంపు అంశం కూడా ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 2 శాతం పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. అయితే ఈ ఏడాది డీఏ పెంపు ప్రకటన కోసం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సాధారణం కంటే ఎక్కువ కాలం నీరిక్షించాల్సి వచ్చింది. సాధారణంగా డీఏ పెంపు నిర్ణయం మార్చి నెలల్లోనే వెలువడుతుంది. ఈ ఏడాది హోలీ పండుగ సమయంలోనే డీఏ పెంపు ప్రకటనపై ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈసారి కాస్తా ఆలస్యంగానే డీఏ విడుదలైంది. గతంలో చివరి పెంపుతో డీఏ రేటు బేసిక్ శాలరీలో 58 శాతంగా ఉండేది. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో డీఏను 2 శాతం పెంచడంతో... ఇప్పుడు డీఏ 60 శాతానికి పెరిగింది. దీంతో ఉద్యోగుల చేతికి అందే జీతంలో పెరుగుదల కనిపించింది. ఇక, కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు సార్లు డీఏ సవరిస్తుంటుంది. ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా ఈ పెంపు జరుగుతుంది. ఉద్యోగులకు ద్రవ్యోల్బణం నుంచి ఉపశమనం కల్పించడమే డీఏ పెంపు ప్రధాన లక్ష్యం. ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి ఉ ద్యోగులను రక్షించడానికి డియర్‌నెస్ అలవెన్స్ ఇవ్వబడుతుంది. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు... పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఖర్చులను వారు సులభంగా భరించగలిగేలా ప్రభుత్వం ఉద్యోగుల డీఏను పెంచుతుంది. డీఏ పెంపు అంటే.. నేరుగా ఉద్యోగుల జీతంలో పెంపు ఉంటుందని అర్థం. ఉద్యోగుల బేసిక్ జీతం ఆధారంగా ఈ పెంపుదల ఉంటుంది.ప్రస్తుత డీఏ పెంపు 2026 జనవరి 1 తేదీ నుంచి అమలులోకి రానుంది. అయితే డీఏ అనేది ప్రతి ఏడాది జనవరి, జులై నెలల్లో సవరించాల్సి ఉండగా... కేంద్ర ప్రభుత్వం కాస్త ఆలస్యంగా మార్చిలో ఒకసారి తర్వాత సెప్టెంబర్– అక్టోబర్ మధ్యలో ఒకసారి డీఏ సవరిస్తూ వస్తోంది. అయితే ఆలస్యంగా సవరింపు చేసినప్పటికీ.. జనవరి 1, జూలై 1వ తేదీల నుంచే పెంచిన డీఏలు అమలులో వస్తాయి.

### యోగ ప్రతి ఒక్కరి జీవి తంలో భాగస్వామ్యం కావాలి

పటాన్చెరు : నేటి వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యం పరిరక్షణకు యోగ అత్యంత అవసరమని..ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని పీవీ నరసింహా రావు ఆడిటోరియంలో పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారం రోజుల ఉచిత మెగా యోగ, ఆరోగ్య శిబిరాన్ని సోమవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతతను కూడా కలిగించే యోగను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.ప్రతి రోజూ కొద్ది సేపు యోగాసనాలు, ప్రాణాయామం చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి, శరీరానికి నూతన శక్తి లభిస్తుందని అన్నారు. ప్రధానంగా ఉ ద్యోగస్తులు, విద్యార్థులు, గృహిణులు యోగను అలవాటు చేసుకుంటే ఆరోగ్య సమస్యలు తగ్గే అవకాశముందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రజలకు యోగా పైన అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో సొంత నిధులతో ఉచిత యోగా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగ కీలకమని, ప్రతి ఒక్కరూ దీనిని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉ ందని అన్నారు. వారం రోజుల పాటు జరగనున్న యోగ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పతంజలి యోగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శివుడు, నరసింహ, యోగా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### కరెంట్ షాక్‌తో అసిస్టెంట్ లైన్‌మన్ మృతి

కోహెడ, : కోహెడ మండలం నారాయణపూర్ గ్రామంలో అసిస్టెంట్ లైన్మెన్ భూక్య సురేష్ (40) కరెంట్ షాట్ తో మృతి చెందారు. ఎస్ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వ్యవసాయ బావుల దగ్గర కరెంటు వైర్లు కిందికి ఉండడంతో వ్యవసాయ రైతులు లైన్మెన్ కు కరెంట్ వైర్లు పైకి లేపాలని కోరారు. కరెంటు వైర్లు పైకి పునరుద్ధరణ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాట్ తో మృతి చెందారు. రెండు ఫీడర్ల నుండి కరెంటు సప్లై అవ్వడంతో ప్రమాదం జరిగింది. మృతుని భార్య పిర్యాదు తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతునికి కొడుకు, కూతురు ఉ న్నారు.

## డబ్బున్న మైనర్ బాలికలే టార్గెట్





హైద్రాబాద్: సంపన్న కుటుంబాలకు చెందిన మైనర్ బాలికలే లక్ష్యంగా వల విసిరి, ప్రేమ పేరుతో వారిని వంచించి లక్షలాది రూపాయలు కాజేస్తున్న ఒక ఘరానా మోసగాడిని హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం చామల్లమూడి గ్రామానికి చెందిన కోడూరి చంద్రశేఖర్ ఆజాద్ అలియాస్ అర్జున్ (23) సోషల్ మీడియా వేదికగా.. గత రెండేళ్లలో దాదాపు 20 మందికి పైగా బాలికలను నమ్మించి మోసగించినట్లు విచారణలో వెల్లడైంది.ప్రస్తుతం మియాపూర్‌లో నివసిస్తున్న ఆజాద్.. జూబ్లీహిల్స్ వంటి సంపన్న ప్రాంతాల్లోని ఇళ్లపై నిఘా పెట్టేవాడు. అక్కడి వాచ్‌మెన్లు, తోటమాలితో పరిచయం పెంచుకుని ఆ ఇళ్లలోని మైనర్ బాలికలు, యువతుల వివరాలు సేకరించేవాడు. ఇన్స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో తాను ఖరీదైన కార్లు, పబ్బుల్లో దిగిన ఫోటోలను పంపి తనకు తాను పెద్ద ధనవంతుడినని నమ్మించేవాడు. వారిని ప్రేమలోకి దించి ఆ తర్వాత ఏకాంతంగా ఉన్న సమయంలో రహస్యంగా ఫోటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడేవాడు.ఇటీవల జూబ్లీహిల్స్‌లో నివసించే ఓ 15 ఏళ్ల బాలికను అర్జున్ అనే మారు పేరుతో పరిచయం చేసుకున్న ఆజాద్.. ఆమెను లోబరుచుకున్నాడు. గతంలోనే ఇతనిపై పోక్సో కేసు నమోదైనా.. జైలు నుంచి వచ్చాక మళ్లీ అదే బాలికను వేధించడం మొదలుపెట్టాడు. నిందితుడి బెదిరింపులకు భయపడి ఆ బాలిక తన ఇంట్లో ఉన్న రూ. 29 లక్షల నగదును చోరీ చేసింది. ఇందులో ఆజాద్‌కు రూ. 13 లక్షలు ఇవ్వగా.. ఈ విషయం తెలిసి బ్లాక్‌మెయిల్ చేసిన ఆ ఇంటి కారు డ్రైవర్ భార్యకు రూ. 10 లక్షలు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు.కేవలం మైనర్లనే కాకుండా.. నార్సింగి ప్రాంతానికి చెందిన ఓ యువతిని కూడా ఆజాద్ వంచించాడు. గుంటూరులో కాలేజీలో చేర్పించే నెపంతో ఆమెను హోటల్ గదికి తీసుకెళ్లి శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఆ తర్వాత వారు ఏకాంతం గా గడిపిన ఫోటోలు, వీడియోలు చూపిస్తూ బెదిరించి ఆమె నుంచి బంగారు గొలుసును కాజేశాడు. బాధితుల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన జూబ్లీహిల్స్ పోలీసులు ఆజాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తల్లిదండ్రులు తమ పిల్లల సోషల్ మీడియా వినియోగంపై ఓ కన్నేసి ఉంచాలని పోలీసులు సూచిస్తున్నారు. వారి ప్రవర్తనలో ఏదైనా తేడా అనిపిస్తే వెంటనే ఆరా తీయాలని చెబుతున్నారు. ఈజీ మనీకి అలవాటు పడి చాలా మంది కేటుగాళ్లు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని.. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

### సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలి

చిట్యాల,: నకిరేకల్ నియోజకవర్గంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను నిర్ణీత కాలంలో పూర్తిచేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. నకిరేకల్ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశంను ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సమావేశంలో బ్రహ్మణవెల్లంల ప్రాజెక్ట్, అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మరియు పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పురోగతిపై సమగ్రంగా వివరాలు తెలుసుకుని, తగు సూచనలను ఆయన అందజేశారు. పనుల పురోగతి నిర్ణీత కాలంలో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్లో ఉన్న ఇతర ఇరిగెషన్ పనులను వేగవంతంగా, తగు నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.


## చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవరినైనా ఉపేక్షించబోం



హైద్రాబాద్: దేశవ్యాప్తంగా సాగుతున్న భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ పోలీసులు ఛేదించారు. ఆపరేషన్ ఆక్టోపస్–2.0 పేరుతో నిర్వహించిన ఈ భారీ ఆపరేష న్‌లో మొత్తం 9 రాష్ట్రాల్లో సోదాలు నిర్వహిం చి, బ్యాంకు అధికారులు సహా 52 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పెట్టుబడి స్కామ్‌లు, ట్రేడింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్' పేరుతో అమాయకులను బెదిరించి భారీగా సొమ్ము దోచుకుంటున్న ముఠాలకు అండగా నిలుస్తున్న బ్యాంకు అధికారులే లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగింది.నిందితుల్లో 32 మంది బ్యాంకు అధికారులు, 15 మంది మ్యూల్ ఖాతాదారులు, ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు. సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కైన కొందరు బ్యాంకు అధికారులు వారి కోసం అక్రమంగా బ్యాంకు ఖాతాలు (మ్యూల్ అకౌంట్స్) తెరిచి ఇస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ వి.అరవింద్ బాబు, ఏసీపీ ఆర్‌జీ శివ మారుతి నేతృత్వంలో 16 ప్రత్యేక బృందాలు ఈ ఆపరేషన్లో పాల్గొన్నాయి.మొత్తం 7 రోజుల పాటు 9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి నెట్‌వర్క్‌ను ఛేదించాయి. ఫిబ్రవరిలో నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్–1లో 16 రాష్ట్రాల నుంచి 117 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ ఆపరేషన్‌లో వెలుగు చూసిన అంశాల ఆధారంగా ఇప్పుడు రెండో విడతగా 'ఆపరేషన్ అక్టోపస్–2.ఓ చేపట్టారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ జరిపిన లోతైన దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.బాధితుల సొమ్మును దారి మళ్లించేందుకు నేరగాళ్లు ఏకంగా 350 బ్యాంకు ఖాతాలను వినియోగించారు. ఈ ఖాతాలకు దేశవ్యాప్తంగా నమోదైన సుమారు 850 సైబర్ కేసులతో సంబంధం ఉంది. వీటి ద్వారా దాదాపు రూ.150 కోట్ల మేర మోసాలు దర్యాప్తులో తేలింది. బ్యాంకు అధికారులు మోసగాళ్లతో చేతులు కలిపి నిబంధనలకు విరుద్ధంగా ఖాతాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు.బ్యాంకుల పేరు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరో డా, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఇండస్సింద్ బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్/అసిస్టెంట్ అకౌంట్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, ప్రొబేషనరీ అధికారి కేవైసీ ఆమోదించేవారు.ఈ ఆపరేషన్‌లో భాగంగా సైబ ర్ మోసాలకు పాల్పడుతున్న ముఠాలను ఆటకట్టించేందుకు 16 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలోని ఈ బృందాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణ రాష్ట్రా ల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి కీలక నిందితులను, వారికి సహకరిస్తున్న బ్యాంకు అధికారులను అదుపులోకి తీసుకున్నాయి.ఈ భారీ ఆపరేషన్‌లో భాగంగా నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్కు పుస్తకాలు, రెండు పెన్ డ్రైవ్లు, ఒక ల్యాప్‌టాప్‌తో పాటు 21 షెల్ కంపెనీల స్టాంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైమ్స్ డీసీపీ వి.అరవింద్ బాబు, ఏసీపీ శివ మారు తి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ దాడుల్లో సీసీపీఎస్ అధికారులు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు అత్యం త చాకచక్యం గా వ్యవహరించి, అంతరాష్ట్ర నెట్‌వర్క్‌ను ఛేదించాయి.సైబర్ నేరాల కట్టడిలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని, చట్టాన్ని ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తి లేదని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ అన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రైవేటు బ్యాంకులు కేవైసీ నిబంధనలను తుంగలో తొక్కుతూ, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండానే ఖాతాలు తెరవడానికి అనుమతించడం వల్లే 'మ్యూల్' ఖాతాలు పుట్టుకొస్తున్నాయని ఆయన చెప్పారు.బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం నేరగాళ్లకు వరంగా మారుతోందని, ఇలాంటి ఉదంతాల్లో బాధ్యులైన వారిపై ఉక్కుపాదం మోపుతామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. బాధితులకు సత్వర న్యాయం చేకూర్చడమే లక్ష్యంగా దర్యాప్తును ముమ్మరం చేశామని, నేర ముఠాల్లోని కీలక వ్యక్తులను పట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ కొనసాగుతోందని వివరించారు.నేరగాళ్ల ఉ చ్చులో పడకుండా ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలని, అధిక లాభాల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మకూడదని కోరారు. షేర్ మార్కెట్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టే ముందు సదరు సంస్థలకు సెబీ గుర్తింపు ఉందో లేదో సరిచూసుకోవాలని సూచించారు. దర్యాప్తు సంస్థల పేరుతో వచ్చే వీడియో కాల్స్‌కు భయపడాల్సిన అవసరం లేదని, డిజిటల్ అరెస్టులు చేసే సంస్కృతి ఏ వ్యవస్థలోనూ లేదని స్పష్టం చేశారు.వ్యక్తిగత బ్యాంకు ఖాతాలను ఇతరులకు వాడటానికి ఇచ్చి, అక్రమాలకు సహకరిస్తే, వారిని కూడా నేరస్థులుగానే పరిగణించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొరపాటున ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, విలువైన 'గోల్డెన్ అవర్'ను వృథా చేయకుండా తక్షణమే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కోరారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే సైబర్ నేర రహిత సమాజం సాధ్యమవుతుందని సీపీ వీసీ సజ్జనార్ తెలిపారు.

# పెద్దిపై నోరు విప్పని మృణాల్





ఓ భారీ చిత్రంలో కాస్టింగ్‌కు సంబంధించి ఆ సినిమా బృందమే అధికారిక ప్రకటన చేయాలి తప్ప.. అది జరగక ముందు ఆర్టిస్టులు నోరు విప్పరు. అందులోనూ పెద్ద హీరోయిన్లు స్పెషల్ సాంగ్స్ లాంటివి చేస్తుంటే.. వాళ్లు దాని గురించి మీడియా వాళ్లు అడిగినా బదులివ్వరు. టీం నుంచే అధికారిక ప్రకటన వస్తేనే బాగుంటుందని మౌనం వహిస్తారు. ఇప్పుడు మృణాల్ ఠాకూర్ కూడా అదే పని చేసింది. ఈ ముంబయి భామ.. రామ్ చరణ్ కొత్త చిత్రం పెద్దిలో ఐటెం సాంగ్ చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. సినిమాలో హైలైట్ అవుతుందని భావిస్తున్న ఆ పాట గురించి సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తాను కథానాయికగా నటించిన డెకాయిట్ మూవీకి సంబంధించి ప్రమోషనల్ ఈవెంట్లో పెద్ది స్పెషల్ సాంగ్ గురించి అడిగితే.. మృణాల్ సమాధానం దాటవేసింది. డెకాయిట్ గురించే ప్రశ్నలు అడగాలని ఆమె ఒకటికి రెండుసార్లు నొక్కి వక్కాణించింది. పెద్దిలో మృణాల్ స్పెషల్ సాంగ్ చేయనట్లయితే.. తాను అందులో భాగం కాదని చెప్పేసి ఉండొచ్చు. సమాధానం దాటవేసింది అంటే ఆమెను ఆ పాటలో చూడబోతున్నట్లే భావించాలి. ఇక తెలుగులో తాను మిస్సయిన పెద్ద సినిమాల గురించి మృణాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సీతారామం, హాయ్ నాన్న సినిమాల తర్వాత తనకు చాలా పెద్ద పెద్ద సినిమాల్లో అవకాశాలు వచ్చాయని ఆమె వెల్లడించింది. ఆ సినిమాల ప్యాకేజీ చాలా టెంప్టింగ్‌గా అనిపించిందని కూడా ఆమె తెలిపింది. కానీ సీతామాలక్ష్మి, యశ్న పాత్రలను తనకు ఒక బెంచ్ మార్క్ సెట్ చేసి పెట్టాయని.. తెలుగు ప్రేక్షకులు తనకు అత్యున్నత స్థాయిని ఇచ్చారని.. అలాంటపుడు మామూలు పాత్రలు చేసి వాటి విలువ తగ్గించకూడదన్న ఉద్దేశంతో తాను మర్యాదపూర్వకంగా కొన్ని క్యారెక్టర్లను తిరస్కరించానని మృణాల్ తెలిపింది. గత జన్మలో తాను ఏదో మంచి చేసి ఉంటే తప్ప.. తెలుగు ప్రేక్షకుల నుంచి తనకు ఇంత ప్రేమ దొరకదని.. సీతామాలక్ష్మి లాంటి పాత్ర చేయడం తన అదృష్టమని ఆమె చాలా ఎమోషనల్‌గా చెప్పింది.

# రియల్ ఎస్టేట్ రంగం లో భారీ మోసం

హైదరాబాద్ : హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో భారీ మోసం వెలుగుచూసింది. నగరంలోని వివాదాస్పద భూములను అమ్ముతామని నమ్మించి, ఢిల్లీకి చెందిన ఒక ప్రముఖ సంస్థను రూ. 14.85 కోట్లకు ముంచిన ఆరోపణలపై సంధ్యా కన్‌స్ట్రక్షన్స్ యజమాని శరణాల శ్రీధర్ రావు, ఆయన భార్య సంధ్యలపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. ఢిల్లీకి చెందిన ఏథెనా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2021లో హైదరాబాద్‌లో భూములు కొనుగోలు చేయాలని చూసింది. ఈ క్రమంలో శ్రీధర్ రావు దంపతులు ఆ సంస్థను సంప్రదించారు. నగరంలోని పలు ఖరీదైన భూములను చూపించి, అవి తమవేనని నమ్మబలికారు. నకిలీ పత్రాలను చూపి, భూమి అమ్మకానికి ఒప్పించి అడ్వాన్స్ రూపంలో ఏకంగా రూ. 14.85 కోట్లు వసూలు చేశారు. డబ్బులు చేతికి అందాక శ్రీధర్ రావు దంపతులు అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకు తిరుగుతూ ఆచూకీ లేకుండా పోయారు. ఈ క్రమంలో పోలీసుల విచారణ నుంచి తప్పించుకునేందుకు 'సంధ్యా కన్‌స్ట్రక్షన్స్' పేరును 'సంధ్యా హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్' గా మార్చినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ డబ్బు తిరిగి ఇవ్వమని కోరినందుకు నిందితులు బెదిరింపులకు కూడా పాల్పడినట్లు సమాచారం. ఏథెనా ప్రాజెక్ట్స్ డైరెక్టర్ విజయ్ భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదుతో సైబరాబాద్ పోలీసులు శ్రీధర్ రావుతో పాటు ఆయన భార్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గతంలో కూడా శ్రీధర్ రావుపై పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వివాదాస్పద భూలావాదేవీలు, నిధుల మళ్లింపు ఆరోపణలు, అడ్వాన్స్‌గా తీసుకున్న కోట్లాది రూపాయలను ఎక్కడికి తరలించారు? కంపెనీ పేరు మార్పుకు దారితీసిన పరిస్థితులతో సహా పలు ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో తేలిన అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# తెలంగాణలో బీజేపీకి ఓటు అడిగే హక్కే లేదు




వరంగల్, మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో, డిలిమిటేషన్ ప్రక్రియ ద్వారా 2029 ఎన్నికల్లో బీజేపీ గెలుపు కుట్రలు చేస్తుందని, ఇది మహిళా రిజర్వేషన్ బిల్లు కాదని, డీ లిమిటేషన్ బిల్లు అని అందుకే ఇండియా కూటమి వ్యతిరేకించినట్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. డీసీసీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్లో రాజకీయ శక్తులు బీజేపీకి తలవంచి దక్షిణాది ప్రయోజనాలను తాకట్టు పెట్టాయని, జనగణన, డిలిమిటేషన్ పేరుతో మహిళల ఆశలను రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకోవడం సిగ్గుచేటన్నారు. మహిళలపై కపట ప్రేమ నటిస్తున్న బీజేపీ మహిళా రిజర్వేషన్ను 2024లో ఎందుకు అమలు చేయలేద న్నారు. రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఉపేక్షించబోమని, దేశ సమాఖ్య స్ఫూర్తిని కాపాడేందుకు ప్రతిపక్షాలు ఐక్యంగా పోరాడుతూనే ఉంటామని ఆమె స్పష్టం చేశారు. పార్లమెంట్లో బీజేపీ కూటమి తీసుకొస్తున్న బిల్లులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఎంపీలకు ముందస్తు సమాచారం లేకుండా, సరైన చర్చకు అవకాశం ఇవ్వకుండా హడావిడిగా ప్రవేశపెట్టడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు, ముఖ్యంగా ఇండియా కూటమి, ఏకతాటిపైకి వచ్చి బీజేపీ తీరును తిప్పికొడుతున్నాయని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ, 2023లోనే అన్ని పార్టీల సమ్మతితో బిల్లు ఆమోదం పొందిందని గుర్తుచేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ తక్షణ అమలు చేయాలని డిమాండ్ చేసిందని, కానీ బీజేపీ ప్రభుత్వం 'జనగణన' 'డిలిమిటేషన్' పేర్లతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఇది నిజంగా మహిళా రిజర్వేషన్ బిల్లు అయితే 2024కే అమలు చేయాలి. కానీ అమలు చేయకుండా వాయిదా వేయడం వెనుక బీజేపీ రాజకీయ ప్రయోజనాలే ఉన్నాయని ఎంపీ స్పష్టం చేశారు. ఇక పార్లమెంట్లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన తెలంగాణపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్థలం కొని మరిచిపోయిన పూరి జగన్నాథ్



ఫిలిం సెలబ్రెటీల్లో చాలామంది ఇండస్ట్రీలో సంపాదించే డబ్బులను భూమి మీద పెట్టుబడిగా పెడుతుంటారు. ఇలా పాత కాలంలో పెట్టుబడులు పెట్టిన వాళ్లు ఇప్పుడు వందల కోట్ల స్థాయికి చేరుకున్నారు. అలాంటి ఉదాహరణలు ఇండస్ట్రీలో చాలానే కనిపిస్తాయి. ఐతే స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ ఇలా ఆస్తులు సంపాదించి, తర్వాత పోగొట్టుకున్న సంగతి తెలిసిందే. తర్వాత పుంజుకుని ఒక స్థాయిలో నిలబడ్డారు. ఐతే చాలా ఏళ్ల ముందు హైదరాబాద్‌లోని మణికొండలో ఒక స్థలం కొని, దాని గురించి తర్వాత మరిచిపోయారట పూరి. ఈ విషయాన్ని ఆయనకు సన్నిహితుడైన సంగీత దర్శకుడు, నటుడు రఘు కుంచె ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. మణికొండ ఎక్కువ అభివృద్ధి చెందని రోజుల్లో 500-1000 గజాల మధ్య పూరి జగన్నాథ్ స్థలం కొన్నారని.. కానీ తర్వాత అది ఎక్కడుందో కూడా మరిచిపోయారని రఘు తెలిపాడు. తాను, పూరి కలిసి ఒక సందర్భంలో ఆ స్థలం ఎక్కడుందో చూద్దామని వెళ్తే.. అక్కడ మారిన పరిస్థితుల వల్ల అదెక్కడుందో అర్థం కాలేదని రఘు తెలిపాడు. తాము మణికొండకు వెళ్లి వెతుకుతూ ఉంటే.. ఒక చోట రాజమౌళి, కీరవాణి కనిపించారని.. వాళ్లు కూడా అక్కడ స్థలం కొన్నారని.. అప్పుడు పూరి స్థలాన్ని కూడా వాళ్లే గుర్తించి ఫలానా చోట ఉందని చూపించారని రఘు తెలిపాడు. ఇక తన ఆర్థిక పరిస్థితి గురించి చెబుతూ.. తనకు ఇండస్ట్రీలోకి వచ్చినప్పటి నుంచి డబ్బుకు లోటు లేదని.. యాంకర్లలో కారు కొన్న, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ కొనుక్కున్న తొలి వ్యక్తిని తానే అని రఘు తెలిపాడు. సింగర్‌గా ఉన్నా, సంగీత దర్శకుడు అయినా, నటుడిగా మారినా.. తనకు అవకాశాలకు లోటు లేకపోయిందని.. డబ్బులు కూడా కోరుకున్నంత వచ్చాయని.. దేవుడు చేసిన మనుషులు చిత్రానికి అప్పట్లోనే రూ. 45 లక్షలు తీసుకున్నానని.. అది అప్పట్లో టాలీవుడ్లో ఒక మ్యూజిక్ డైరెక్టర్‌కు దక్కిన సెకండ్ హైయెస్ట్ రెమ్యూనరేషన్ అని రఘు కుంచె తెలిపాడు. ఐతే తనకు విలాసవంతంగా బతకడం ఇష్టం కావడంతో.. డబ్బులతో భూములు కొనాలి అనుకోలేదని.. అందువల్ల ఆస్తులు పెరగలేదని రఘు చెప్పాడు.

# పోషకాహారం చిన్నారుల ఆరోగ్యానికి పునాది

వరంగల్, పోషకాహారం చిన్నారుల ఆరోగ్యానికి పునాదియని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ రైతు వేదికలో పోషణ్ పక్వాడ వారోత్సవాలలో భాగంగా మండల స్థాయి పోషణ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి హాజరై పలు కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక విద్యార్థుల ఎగ్జిబిషన్, స్థానికంగా లభించే వనరులతో తయారు చేసే పోషకాహార పదార్థాల స్టాల్స్, చిరుధాన్యాలతో కూడిన ఆహార ప్రదర్శనలను కలెక్టర్ సందర్శించారు. పలు అంగన్వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులకు కలెక్టర్ సమక్షంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం కూడా చేపట్టారు. విద్యార్థుల ప్రగతి రికార్డులను పరిశీలించి, వారి అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యోగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి రోజు కరెక్యులంలో భాగంగా కనీసం 15 నిమిషాల పాటు యోగా చేయించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించడంతో పాటు ఇంటి వద్ద కూడా పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. మహిళలు రక్తహీనత సమస్యకు గురికాకుండా ఉండేందుకు ప్రోటీన్లు, ఫైబర్, ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి, స్థానికులు ఈ సేవలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

# ఉచిత రైలు ప్రయాణంపై సర్కార్ క్లారిటీ

హైద్రాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీ నుంచి హైదరాబాద్ నగరంలో ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని వార్తలు వెలువడ్డాయి. అయితే దీనిపై సోషల్ మీడియా, కొన్ని మీడియాలో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణం కల్పించే అంశంపై దక్షిణ మధ్య రైల్వేతో తెలంగాణ ప్రభుత్వం కీలక చర్చలు జరుగుతున్నాయని పేర్కొంది. వీటికి సంబంధించి.. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై ప్రభుత్వం అధికారిక వివరణ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తరపున హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్ఎంఏ), పట్టణాభివృద్ధి శాఖ సంయుక్తంగా దక్షిణ మధ్య రైల్వే కు ఒక ప్రతిపాదనను పంపించినట్లు తెలిపింది. రాష్ట్ర సర్కార్ ఈ అధికారిక ప్రతిపాదనను రైల్వే శాఖకు లేఖ ద్వారా పంపించింది. ప్రయాణికులకు ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలనే అంశాన్ని పరిశీలించాలని కోరినట్లు వెల్లడించింది. అయితే ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన దక్షిణ మధ్య రైల్వే.. కొన్ని టెక్నికల్ అంశాలను ప్రస్తావించినట్లు పేర్కొంది. ఈ ఉచిత రైలు పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన నిబంధనలతో కూడిన ఒప్పందాన్ని (ఎంఓయూ) సమర్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని దక్షిణ మధ్య రైల్వే కోరింది. ఇక దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలంటే.. ఆ ప్రతిపాదనను ఆమోదం కోసం రైల్వే బోర్డుకు పంపించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. రైళ్ల సంఖ్య.. రైలు వేళలు, స్టేషన్లలో కల్పించే సౌకర్యాలు అన్నీ కూడా రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం కల్పించబడతాయని పేర్కొంది. అయితే ఈ ఉచిత రైలు ప్రయాణ అంశం ప్రస్తుతం పరిశీలన దశలో ఉందని.. కానీ కొందరు ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దానిపై వివరణ ఇచ్చింది. ఉచిత ఎంఎంటీఎస్ రైలు ప్రయాణానికి సంబంధించి ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని.. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మి ప్రయాణికులు గందరగోళానికి గురికావద్దని హితవు పలికింది. ప్రభుత్వం అధికారికంగా వెలువరించే ప్రకటనలను మాత్రమే నమ్మాలని పేర్కొంది. రైల్వే బోర్డు ఆమోదం.. ఒప్పంద ప్రక్రియ పూర్తి అయిన తర్వాతే ఉచిత రైలు ప్రయాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# హాల్ టికెట్ ఇవ్వలేదని విద్యార్థి ఆత్మహత్య!

హైదరాబాద్ : హైదరాబాద్ శివారులోని హయత్‌నగర్‌లో విషాదం చోటుచేసుకుంది. కళాశాల యాజమాన్యం వేధింపులు తాళలేక ఓ బీటెక్ విద్యార్థి తన ప్రాణాలను తీసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. హయత్‌నగర్ పరిధిలో నివాసముంటున్న ప్రణీత్ అనే విద్యార్థి, ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం తన నివాసంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థి ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రణీత్ మృతికి కళాశాల యాజమాన్యమే కారణమని అతని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ కుమారుడికి హాజరు శాతం తక్కువగా ఉందన్న నెపంతో, పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్ ఇవ్వకుండా యాజమాన్యం వేధించిందని వారు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హాల్ టికెట్ కోసం కోరినప్పుడు అందరి ముందు అవమానకరంగా మాట్లాడటంతో ప్రణీత్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని వారు తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాలేజీ యాజమాన్యం తీరుపై విచారణ ప్రారంభించారు. ఒకవేళ హాజరు తక్కువగా ఉన్నా, విద్యార్థిని తీవ్రంగా అవమానించడం వల్లే ఈ అఘాయిత్యం జరిగిందా అనే కోణంలో సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

# మున్సిపల్ అభివృద్ధికి కృషి

హుజూర్ నగర్: హుజూర్ నగర్ మున్సిపాలిటీ లోని 28 వార్డులలో ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జునరావు తెలిపారు. పట్టణంలోని 2వ సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో హుజూర్ నగర్ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. మిషన్ భగీరథ నీరు అందించేందుకు సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

# రైతులకు ఎట్టి పరిస్థితులు ఇబ్బందులు రానివ్వం



భూత్పూర్ : రైతులు ధాన్యం విక్రయించేందుకు ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులు రాకూడదని సంకల్పంతో ముందుగానే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలం పరిధిలో పోతులమడుగు, అన్నసాగర్ గ్రామలలో, మూసాపేట్ మండలం జానంపేట్, కొమ్మిరెడ్డి పల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో పడతాయన్నారు, గ్రేడ్-ఏ రకం (సన్నాలు) ధాన్యం క్వింటాకు రూ. 2,389, సాధారణ రకం క్వింటాల్ కు రూ. 2,350 మద్దతు ధర ఇస్తామని, సన్నరకం ధాన్యం క్వింటాల్ కు రూ. 500 బోనస్ ఇస్తామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని అన్నారు, రైతుల తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, గన్ని బ్యాగులు అవసరం ఉంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని అధికారులను కోరారు, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావల్సిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# సామూహిక హోమాలతో ఆధ్యాత్మిక వాతావరణం

వెంకటాపూర్, : మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాలు రెండో రోజుకు చేరుకున్న సందర్భంగా ఆదివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే గణపతి పూజతో పాటు సామూహిక హోమాలు నిర్వహించగా, అనంతరం లక్ష్మీ పూజలు, ధాన్యాధివాసం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా విగ్రహాన్ని ధాన్యంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, సకల సంపదలు కలగాలని భక్తులు ప్రార్థనలు చేశారు. భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక హోమాలు, లక్ష్మీ పూజల్లో పాల్గొన్నారు. మొత్తం 100 హోమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నూనె నరేష్ తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల 29 నిమిషాలకు యంత్ర ప్రతిష్ట, వాస్తు పూజ, ప్రాణ ప్రతిష్ట, దిష్టి కుంభం వంటి ముఖ్య ఘట్టాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలి



రుద్రంగి, : వర్షకాలం ప్రారంభంలోపే కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారు లకు, కాంట్రాక్టర్‌కు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీని వాస్ ఇరిగేషన్ అధికారు లతో కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వేగాన్ని పెంచాలని అధి కారులకు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.. వచ్చే వర్షాకాలం ప్రారంభా నికి ముందే ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని అన్నారు. రాత్రి సమయంలో కూడా పనులు జరుగు తున్నాయాని అధికారులు వివరించారు. గత సమావేశం తరువాత జరిగిన పనులను అధికారులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వివరించారు. ప్రస్తుతం కట్ట బండ్ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలి పారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల రైతులకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చే కీలక ప్రాజెక్ట్ అయిన కలికోట సూరమ్మ చెరువు అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నా యన్నారు. పనుల అమలు పర్యవేక్షణకు తిరిగి మళ్లి 11 రోజుల తరువాత సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 43 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాంతీయ రైతులకు భారీగా లాభం చేకూరనుంది. ఇప్పటికే ప్రాజెక్టుకు సంబంధించిన కుడి, ఎడమ కాలు వల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తయిం దని, త్వరలోనే కాలువల నిర్మాణ పనులు ప్రారంభమ వుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సంతూప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభి లాష్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల గగన్, తర్రె లింగం, తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ రంగ కార్మికులకు పెన్షన్లు..



సిద్దిపేట :రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ రంగం సహా అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ఆదుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. అందుకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భవన నిర్మాణ రంగ కార్మికులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించి కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం భవన నిర్మాణ రంగం సహా అన్ని రంగాల కార్మికులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వివేక్ తెలిపారు. మరీ ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని.. త్వరలోనే చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు.రానున్న రోజుల్లో తెలంగాణలోని ప్రతి జిల్లాకు భవన నిర్మాణ కార్మికుల కోసం ఒక సంఘం భవనాన్ని కూడా నిర్మాణం చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కృషి చేస్తున్నట్లు మంత్రి వివేక్ వెల్లడించారు. త్వరలోనే లేబర్ బోర్డు ఏర్పాటు చేసి.. రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులకు లేబర్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. అంతేకాకుండా కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు.. పెన్షన్లతోపాటు ప్రమాద బీమాను కూడా అందించేందుకు కావాల్సిన కార్యాచరణను త్వరలోనే రెడీ చేస్తామని మంత్రి వివేక్ భరోసా కల్పించారు.అదే సమయంలో గతంలో సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం తన తండ్రి, కాకా వెంకటస్వామి కృషి చేసినట్లు మంత్రి వివేక్ గుర్తు చేశారు. అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావుతో మాట్లాడి, పోరాటం చేసి మరీ సింగరేణి భూముల రక్షణతోపాటు.. కార్మికులకు పెన్షన్లు అందించేందుకు ఎంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు. కార్మికులకు ప్రమాద బీమాను రూ.10 లక్షలకు కాంగ్రెస్ సర్కార్ పెంచినట్లు గుర్తు చేశారు. గిగ్ వర్కర్స్ భద్రత కోసం అసెంబ్లీలో చట్టాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు చెప్పుకొచ్చారు.మరోవైపు.. రాష్ట్రంలో ఉన్న హమాలీల సంక్షేమానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. సిద్దిపేటలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం భవనానికి స్థలం కేటాయింపుతోపాటు దాని నిర్మాణానికి కూడా హామీ ఇస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కేవలం ఓట్ల కోసం మాత్రమే మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు సిద్దిపేటలో హామీలు ఇచ్చారని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆరోపణలు చేశారు.

# హైవే ప్రయాణికులకు తీపి కబురు..

హైద్రాబాద్: జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఇకపై సమాచారం కోసం ఇతరులను అడగాల్సిన అవసరం కానీ, గమ్యం తెలియక తికమక పడాల్సిన పని కానీ ఉండదు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఒక వినూత్న మార్పును తీసుకువచ్చింది. హైవే వెంబడి ఉన్న మైలు రాళ్లు, సైన్ బోర్డులు, టోల్ ప్లాజాల వద్ద ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసింది. ప్రయాణికులు తమ స్మార్ట్‌ఫోన్‌తో ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు.. ఆ రహదారికి సంబంధించిన పూర్తి సమాచారం తక్షణమే మొబైల్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది.సాధారణంగా పెట్రోల్ బంకులు లేదా అత్యవసర సేవల కోసం ప్రయాణికులు గూగుల్ మ్యాప్స్‌పై ఆధారపడుతుంటారు. అయితే, కొన్నిసార్లు నెట్‌వర్క్ సమస్యలు లేదా మ్యాప్‌లో ఖచ్చితమైన సమాచారం లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారికంగా ధ్రువీకరించిన సమాచారాన్ని ఈ క్యూఆర్ కోడ్ ద్వారా అందిస్తోంది. దీనివల్ల ప్రయాణికులకు కచ్చితమైన వివరాలు అందడమే కాకుండా, సమయం కూడా ఆదా అవుతుంది. ఇప్పటికే ఖమ్మం-దేవరపల్లి హైవేను స్మార్ట్ హైవేగా తీర్చిదిద్ది ఈ స్కాన్ బోర్డులను ఏర్పాటు చేసారు. తెలంగాణలోని మరికొన్ని రహదారులను కూడా స్మార్ట్ హైవేలుగా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే రహదారికి సంబంధించి పూర్తి వివరాలు లభిస్తాయి. ప్రయాణ మార్గంలో ఎన్ని టోల్ ప్లాజాలు ఉన్నాయి? అక్కడ చెల్లించాల్సిన ఫీజు ఎంత? టోల్ మేనేజర్ల కాంటాక్ట్ నంబర్లు అందుబాటులో ఉంటాయి. సమీపంలోని పెట్రోల్ బంకులు, టైర్ పంక్చర్ షాపులు, ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్ల లొకేషన్లు తెలుసుకోవచ్చు. హైవే పక్కన ఉన్న నాణ్యమైన హోటళ్లు, రెస్టారెంట్లు, బస చేసేందుకు అందుబాటులో ఉన్న వసతి గృహాల వివరాలు ఉంటాయి. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు, వాహనం మొరాయించినప్పుడు సంప్రదించాల్సిన హైవే హెల్ప్‌లైన్ నంబర్లు, అంబులెన్స్ సేవలు, సమీప ఆసుపత్రులు, పోలీస్ స్టేషన్ల ఫోన్ నంబర్లు తక్షణమే లభిస్తాయి. ఈ నూతన విధానం జాతీయ రహదారులపై ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, సులభతరంగా మారుస్తుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# మహిళా బిల్లు పేరుతో బీజేపీ రాజకీయం





మహబూబ్ నగర్ : మహిళా బిల్లు పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయం చేస్తున్నదని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని బిజెపి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహిళా సాధికారిత కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేసినట్టు తెలిపారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ చట్టం తీసుకొచ్చి మహిళలకు భాగస్వామ్యం కల్పించినట్లు తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. డీలిమిటేషన్ బిల్లును మహిళా బిల్లుతో ముడిపెట్టడం సరికాదన్నారు. ఇప్పుడున్న 543 పార్లమెంట్ స్థానాలకు అనుగుణంగా మహిళా రిజర్వేషన్ బిల్లు పెడితే కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. మహిళా బిల్లులో ఓబీసి కోటా ఉండాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.టీపీసికి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ మాట్లాడుతూ మహిళా బిల్లు పేరుతో ప్రతిపక్ష ఇండియా కమిటీని ప్రజల ముందు బదనాం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. తమిళనాడు, బెంగాల్ ఎన్నికల్లో లబ్ధిపొందడానికి బీజేపీ ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని విమర్శించారు.టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ డీలిమిటేషన్ వల్ల దక్షిణాది , ఈశాన్య రాష్ట్రాలకు నష్టం జరుగుతున్న విషయాన్ని ఎఐసిసి అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి పలు సార్లు చెప్పడం జరిగిందన్నారు. మహిళలను మోసం చేసే విధంగా బిజెపి ప్రభుత్వం బిల్లుపై రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటుపై బిజెపి ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని అన్నారు. సమావేశంలో నాయకులు చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్ , రాముని యాదవ్, ఫయాజ్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు 'సర్'పై అవగాహన పెంచుకోవాలి

కరీంనగర్ : కార్యకర్తలు 'సర్'పై అవగాహన పెంచుకోవాలని కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ అన్నారు. కరీంనగర్ కాంగ్రెస్ కార్యాలయంలో 'సర్'(స్పెషల్ ఇంటోన్సివ్ రివిజన్-2026)పై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ. 'సర్'పై అవగాహన కల్పించేందుకు మైనార్టీసెల్ మంచి కార్యక్రమాన్ని చేపట్టిందని అభినందించారు. ఓట్ల మ్యాపింగ్‌పై ఏజెంట్లకు పూర్తి అవాగహన కల్పించే విధంగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శిక్షకులు అబ్దుల్ ముజీబ్ అయ్యూబ్, ఎహ్తెషామ్‌ఉల్‌హక్, వసీంఅక్రం బీఎల్ఏల పాత్ర, బాధ్యతలు, ఎన్యుమరేషన్ ఫార్ములా, ఓటర్ల ధ్రువీకరణ, సెల్ఫ్ మ్యాపింగ్, ప్రోజెనీ మ్యాపింగ్, క్లెయిమ్స్, అభ్యంతరాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

# బీసీ ఎమ్మెల్యే ఎదుగుదలను ఓర్వలేకే విమర్శలు




యాదగిరిగుట్ట, : బీసీ ఎమ్మెల్యే ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు స్థాయిని మరిచి విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈమధ్య కొందరు వార్డు మెంబర్ గా కూడా గెలవని వారు, కులాలను అడ్డం పెట్టుకొని కొందరు, స్థాయిని మరిచి మరి కొందరు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.కొందరు అగ్రవర్ణాల వారు తనపై కుట్ర పన్నుతున్నారని, బీసీ నాయకుడిగా, ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్ గా, డీసీసీ అధ్యక్షుడిగా ప్రతినిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నాడని రాబోయే రోజుల్లో తమ ఉనికిని కోల్పోవాల్సి వస్తుందనే అక్కసుతోనే ఇటువంటి కుట్రలు చేస్తున్నారన్నారు.ఇప్పటికైనా కుటిల రాజకీయాన్ని మరచి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎన్నికల అప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలన్నారు. నా లక్ష్యం ఆలేరు అభివృద్ధి అని దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మాజీ డిసిసిపి చైర్మన్ సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, వైస్ చైర్మన్ పరిగ రమ్య రామచందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, బంధారపు బిక్షపతి గౌడ్, ఎరుకల హేమేందర్ గౌడ్, పెలిమెల్లి శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యవర్తుల్లేకుండా నేరుగా విక్రయం

జడ్చర్ల : ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా మక్కలు విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన మక్కలకు సరైన ధర అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మధ్యవర్తుల ఇబ్బందులు లేకుండా రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు మద్దతుగా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగిస్తామని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అడిగిన వెంటనే కొనుగోలు కేంద్రం మంజూరు చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సభ్యులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

బోయినపల్లి, : చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభి వృద్ధి కార్యమాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. కోధూరుపాక గ్రామంలో వారంతా, నూతన అంగన్‌వాడీ నిర్మాణంతో పాటు పలు అభి వృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం కోరెం కొండ పోచమ్మ ఆలయం వరకు వేసిన సిమెంట్‌రోడ్డు, సింగిల్‌ఫేజ్ విద్యుత్ లైన్ ను ప్రారంభించారు. పోచమ్మ తల్లినీ దర్శించుకుని మొక్కలు చెల్లించుకు న్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్‌చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు సువిన్‌యాదవ్, నాగుల వంశీ, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# హైదరాబాదీలకు అదిరిపోయే గుడ్ న్యూస్..



హైద్రాబాద్: హైదరాబాద్ నగరంలో తెల్లవారుజామున 5గంటల నుంచే మెట్రో సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ తెలంగాణ సీఎస్ రామకృష్ణరావును కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న పలు రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు రోజే అనేక రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని.. ఇలా వచ్చే రైళ్లన్ని ఉదయం 4-5 గంటల మధ్యలోనే హైదారాబాద్‌లోని కీలక స్టేషన్‌లైన సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ వంటి స్టేషన్ చేరుకుంటున్నాయని తెలిపారు. అంతేకాదు హైదరాబాద్ నుంచి వివిధ రాష్ట్రాలకు వెళ్లే వందేభారత్ సమా ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లు సైతం అదే సమయంలో బయల్దేరుతున్నాయన్నారు. ఈ సమయంలో మెట్రో సేవలు అందుబాటులో లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఆయన తెలిపారు.అంతేకాదు ప్రస్తుతం నాగోల్, మియాపూర్, ఎల్‌బీనగర్ వంటి స్టేషన్‌ల నుంచి ఉదయం 6 గంటలకే మెట్రోలు స్టార్ట్ అవుతున్నా.. అవి నాంపల్లి, సికింద్రాబాద్ స్టేషన్‌లకు చేరుకునేందుకు దాదాపు అరగంటపై పైన పడుతుంది. దీంతో ఈ మెట్రోలు స్టేషన్‌లను చేరుకునేందుకు సుమారు 6:30-6:45 అవుతుందన్నారు. ఇదే విషయంపై గతంలోనూ మెట్రోరైలు లిమిటెడ్ ఎండీకి లేఖ రాశామని కానీ అప్పుడు సాంకేతిక అంశాలు, నిర్వహణ కారణాల నేపథ్యంలో మెట్రో సమయంలో మార్పులు చేయలేమని ఎల్అండ్‌టీ-హెచ్‌ఎంఆర్ఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తెలిపినట్టు చెప్పారు. కనీసం ఇప్పుడైనా ఈ సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించి మెట్రో రైళ్లను ఉదయం 5గంటల నుంచి నడిపేలా చూడాలని జీఎం సీఎస్‌ను కోరారు. ఇక రైల్వే జీఎం విజ్ఞప్తిపై తెలంగాణ సీఎస్ రామకృష్ణరావు సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని పరిశీలించాలని ఆయన హెచ్‌ఎంఆర్ఎల్ అధికారులకు సూచించారు.

# నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలు



హైదరాబాద్, : క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణంపై టీపీసీసీ దృష్టి సారించింది. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా పోలింగ్ బూత్ స్థాయి నుంచి గ్రామ, మండల, టౌన్, డివిజన్ స్థాయి వరకు కమిటీల నియామకాన్ని సమన్వయం చేసుకునేందుకు నియోజవకర్గాల వారీగా సమన్వయకర్తలను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం నియమించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్ కోఆర్డినేటర్లను నియమించారు. ఈ కంట్రోల్ రూమ్ కోఆర్టినేటర్లు, నియోజకవర్గస్థాయి కోఆర్డినేటర్లు స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీలు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఎంపీలతో సంప్రదింపులు జరిపి కమిటీల నియామకం చేపట్టనున్నారు. వచ్చే ఎన్నికల నాటికి బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ కమిటీలు, కార్యకర్తలతో పార్టీని బలోపేతం చేసేందుకు ఏఐసీసీ ఈ సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు చైర్మన్‌గా టీపీసీసీ ప్రోటోకాల్ సమన్వయ కమిటీని మహేశ్‌గౌడ్ నియమించారు. ఈ కమిటీకి వైస్‌చైర్మన్‌గా పార్టీ నేత కిషోర్‌రెడ్డి, కన్వీనర్‌గా ఫుడ్ కమిషన్ చైర్మన్ ఎంఏ ఫహీం, సభ్యులుగా పార్టీ నేతలు భానుప్రకాశ్‌రెడ్డి, ప్రసాద్, సూరజ్ తివారి, మహేందర్, అల్లం రాకేశ్‌ను నియమించారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TElTEL 2010/34557, Cell: 9849758280